నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, గురువారం 8 ఫిబ్రవరి 2024 | ADILABAD


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్

# ఇష్టపడి చదవాలి..

● బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ● కేజీబీవీలో ఉత్సాహంగా వార్షికోత్సవం

నేరడిగొండ, ఫిబ్రవరి 7 : విద్యార్థులు కష్టపడి కాకుండా.. ఇష్టపడి చదవాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాఠశాల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే తప్పకుండా పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఇదే పాఠశాలలో చదివిన వాగ్దారి గ్రామానికి చెందిన వైష్ణవి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడంతో ఎమ్మెల్యే ఆమెను శాలువాతో సన్మానించారు. అనంతరం పాఠశాల కోసం రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ, నేరడిగొండ ఎంపీపీలు ప్రీతం రెడ్డి, రాథోడ్ సజన్, మాజీ సర్పంచ్ పెంట వెంకటరమణ, పాండు, వైస్ ఎంపీపీ మహేందర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, శిరీష్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఇచ్చోడ మండల బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ పండరి, ఎంఈవో అన్‌రెడ్డి భూమారెడ్డి, కేజీబీవీ హెచ్‌ఎం రజిత, జడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం పద్మ పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య రానివ్వద్దు..

● మిషన్ భగీరథ ద్వారా అందించాలి..
● గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి..
● నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 7 : వేసవి సమీపిస్తున్న దృష్ట్యా తాగునీటికి సమస్య రానివొద్దని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన నీరు అందించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. బుధవారం న్యూ లోలం, మాడెగాం గ్రామాల్లో మిషన్ భగీరథ వాటర్ ట్రీట్‌ప్లాంట్(డబ్ల్యూటీపీ)ను పరిశీలించారు. అంతకు ముందు న్యూలోలంలో 'మన ఊరు-మన బడి' ద్వారా నిర్మిస్తున్న పాఠశాల గదులు, మిషన్ భగీరథ ట్యాంకు, సెగ్రిగేషన్ షెడ్డు, హరితహారం నర్సరీ, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి మాడెగాంలోని వాటర్ ట్రీట్‌ప్లాంట్ వద్దకు వెళ్లారు. శ్రీరాంసాగర్ నుంచి వస్తున్న నీరు ఏ విధంగా శుద్ధి చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్‌లోని ల్యాబ్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో మోహన్, తహసీల్దార్ సరిత, ఎంపీవో అజీజ్‌ఖాన్, ఈజీఎస్ ఏపీవో దివ్యారెడ్డి, ఐకేపీ ఏపీఎం సులోచనారెడ్డి, ఆర్ఐ సంతోష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మహేశ్ పాల్గొన్నారు.


మండల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## నులి పురుగు నివారణ మాత్రల పంపిణీని సక్సెస్ చేయాలి..


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ధన్‌రాజ్

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 7 : నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్మల్ డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ అన్నారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో నులిపురుగుల నివారణ, పల్స్ పోలియో కార్యక్రమాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీన నిర్వహించే నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్ల లోపు వయసున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలన్నారు. 0 నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలందరికీ పల్స్ పోలియో చుక్కలను వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి రాజేందర్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి నయనారెడ్డి, డిప్యూటీ జిల్లా విస్తరణ అధికారి రవీందర్ పాల్గొన్నారు.

# నిత్యం రూ. 15 లక్షలు నష్టం

## కేంద్రం ప్రకటించిన మద్దతు ధర చెల్లించని సీసీఐ

● మొదట రూ.50, ఆ తర్వాత రూ.100 తగ్గింపు ● కోట్ల రూపాయలను నష్టపోతున్న అన్నదాతలు
● నాణ్యత పేరిట సీసీఐ నాటకం ● ప్రైవేట్ వ్యాపారులకు లబ్ధి చేకూరేలా చర్యలు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా పత్తి రైతులు రోజుకు రూ.15 లక్షలను నష్టపోవాల్సిన దుస్థితి దాపురించింది. మద్దతు ధర చెల్లించి ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అన్నదాతలను నట్టేట ముంచుతున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.7,020 మద్దతు ధరను చెల్లించడం లేదు. నాణ్యత పేరిట క్వింటాలుకు రూ.100 తగ్గించి కొనుగోలు చేస్తున్నది. ఫలితంగా రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్మి భారీగా నష్టపోవాల్సి వస్తున్నది.

### మద్దతు ధర ఏదీ?

జిల్లాలో అక్టోబరు చివరి వారంలో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. పది కేంద్రాల ద్వారా సీసీఐ ఆధ్వర్యంలో పంట ఉత్పత్తులను కొంటామని అధికారులు ప్రకటించారు. మద్దతు ధర రూ.7,020తో కొనుగోలు చేయాల్సి ఉండగా.. జనవరి 20వ తేదీ వరకు అంతంత మాత్రంగానే తీసుకున్నది. పంట నాణ్యతా లేదంటూ క్వింటాలుకు రూ.50 తగ్గించి రూ.6,970తో సీసీఐ కొనుగోలు చేసింది. అనంతరం జనవరి 1 నుంచి ఏకంగా రూ.100 తగ్గించి రూ.6,920 చెల్లించింది. నాణ్యత విషయంలో కుంటిసాకులు చెప్పి ధర తగ్గించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఆదిలాబాద్‌లోని సీసీఐ కార్యాలయం

### రోజుకు రూ.15 లక్షల నష్టం

ఆదిలాబాద్ జిల్లాలో సీసీఐతోపాటు, ప్రైవేటు వ్యాపారులు పత్తిని కొనుగోలు చేస్తారు. జిల్లావ్యాప్తంగా రోజు కనీసం 15 వేల క్వింటాళ్ల వరకు పంటను సీసీఐ, 4 నుంచి 5 వేల క్వింటాళ్ల వరకు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ.100 తగ్గించి సీసీఐ పంటను కొనుగోలు చేస్తుండడంతో రైతులు రోజుకు రూ.15 లక్షల వరకు నష్టపోవాల్సి వస్తున్నది. మొదట పదిహేను రోజులు రూ.50, మరోసారి రూ.100 తక్కువ ధరతో చెల్లించడంతో రైతులు కోట్ల రూపాయలను నష్టపోయారు. పంట నాణ్యత విషయంలో మార్పు లేదని సీసీఐ అధికారులు ప్రైవేటు వ్యాపారులకు లాభం చేకూరేలా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పత్తి ధర తగ్గించడం విషయంలో సీసీఐ అధికారుల నుంచి వివరణ కోసం ప్రయత్నించగా వారు చెప్పడానికి విముఖత వ్యక్తం చేశారు.


ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో పత్తి వాహనాలు

### పంట నాణ్యత కారణం కాదు..



*నేను 15 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి వేశా. 50 క్వింటాళ్ల పత్తిని ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చి సీసీఐకి విక్రయించా. వారు మద్దతు ధర కంటే రూ.100 తక్కువ చేసి రూ.6,920తో కొన్నరు. ధర తగ్గించడం వల్ల నేను రూ.5 వేలు నష్టపోయా. పత్తి నాణ్యత సరిగా లేదు. అందుకే ధర తగ్గించామని సీసీఐ అధికారులు చెప్పడం సరికాదు. జిల్లాలో నేలలు, వాతావరణం పత్తికి అనుకూలమైనవి. రాష్ట్రంలో ఎక్కడ చూసినా జిల్లాలో ఇంతకంటే మంచి పత్తి ఎక్కడా దొరకదు. ప్రైవేటు వ్యాపారులకు లబ్ధి చేకూరేలా సీసీఐ అధికారులు వ్యవహరిస్తున్నారు.*

**- సుభాష్, కౌలు రైతు, భీంసరి, ఆదిలాబాద్ రూరల్ మండలం**

# రుణాలు మంజూరు చేయాలి..

**ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్**

ఎదులాపురం, ఫిబ్రవరి 7 : అర్హులందరికీ సకాలంలో రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన డిసెంబర్ 2023 మాసాంతపు జిల్లాస్థాయి బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకర్లు పంట అనుబంధ రుణాలు, ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్య, గృహ రుణాలతోపాటు ఇతర రుణాలను అర్హులైన పేదలకు మంజూరు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల రుణ పరిమితిని పెంచాలని, ఇచ్చిన రుణాలను సకాలంలో చెల్లించే విధంగా బ్యాంకర్లు అధికారులతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. బ్యాంకులు వార్షిక సంవత్సరం ముగిసేలోగా వారి లక్ష్యాలను అధిగమించాలన్నారు. పంట అనుబంధ రుణాలతోపాటు డెయిరీ, పౌల్ట్రీ యూనిట్లను మంజూరు చేయాలని తెలిపారు. అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. వంద శాతం ఆర్థిక ప్రగతి సాధించినందుకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆర్ఎం వెంకట్రామ్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం ప్రసాద్, నాబార్డ్ డీఎం ఎండీ రవూఫ్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం పద్మభూషణ్ రాజు, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్


జొన్నగట్కా లడ్డులను పంచుకుంటున్న మహిళలు


సామూహికంగా చేసిన వంటలను పంచుకుంటున్న మెస్రం వంశీయుల మహిళలు


నాగోబాకు ఎడ్లబండ్లతో తరలివస్తున్న మెస్రం వంశీయులు

మర్రిచెట్ల వద్ద చర్చిస్తున్న మెస్రం వంశీయుల పటేల్ కితకు చెందిన మహిళలు

నాగోబా జాతరలో వెలిసిన వివిధ దుకాణాలు

# నాగోబాకు చేరుకున్న మట్టికుండలు

ఆలయం వెనుకభాగంలో భద్రపర్చిన మెస్రం వంశీయులు
మర్రిచెట్ల కింద కొనసాగుతున్న సంప్రదాయ పూజలు

*కేస్లాపూర్ జాతరలో ప్రధానంగా ఉపయోగించే మట్టికుండలు నాగోబాకు చేరుకున్నాయి. బుధవారం ఉదయమే ఎడ్లబండ్లలో మట్టికుండలను తీసుకురావడానికి మర్రిచెట్ల నుంచి వెళ్లిన మెస్రం వంశీయులు మధ్యాహానికి చేరుకున్నారు. తీసుకొచ్చిన కుండలను నాగోబా ఆలయం వెనుక భద్రపరిచారు. ఇంకా మర్రిచెట్ల ప్రాంతంలో సంప్రదాయ పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు, పురుషులు వేర్వేరుగా కచేరీలు నిర్వహించి, నాగోబా పూజలపై చర్చించారు. మెస్రం వంశీయుల్లోని 22 కితలవారీగా మహిళలు సామూహిక వంటలు చేశారు. నైవేద్యాలను కితలవారీగా పంచుకున్నారు. సామూహికంగా సహపంక్తి భోజనాలు చేశారు. మరికొందరు రాత్రి పూట చలిమంటలు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయులు పాల్గొన్నారు.*

*- ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 7*


సామూహికంగా వంటలు చేస్తున్న మహిళలు


సంప్రదాయ కట్టుబొట్టులో మెస్రం వంశీయుల మహిళలు


మెస్రం వంశీయులతో చర్చిస్తున్న మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్ రావ్ పటేల్


జొన్నగట్కాతో లడ్డులను చేస్తున్న మహిళలు

## రైల్వే నిర్మాణానికి కేంద్రం మొండిచేయి

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 7 : ఆర్మూర్-నిర్మల్ రైల్వేలైన్ నిర్మాణానికి ప్రతి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రభుత్వాలు హామీని ఇస్తున్న బడ్జెట్‌లో కేటాయింపులు చేయక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు ఆక్షేపించారు. బుధవారం నిర్మల్ సీఐటీయూ కార్యాలయంలో ప్రజా, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నిర్మల్-ఆర్మూర్ రైల్వేలైన్‌ను ప్రజలు రెండు దశాబ్దాలుగా కోరుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యవర్గ సభ్యులు నూతన్‌కుమార్, నాయకులు రామ్-లక్ష్మణ్, రాజు, తిరుపతి, గంగారాం, దిగంబర్, గంగాధర్ ఉన్నారు.

## ట్రాక్టర్‌ను ఢీకొని విద్యార్థి మృతి


విద్యార్థి సుశ్వత్(ఫైల్)

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 7 : నిర్మల్ పట్టణంలోని రాజరాజేశ్వరి గార్డెన్ సమీపంలో వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో విద్యార్థి మృతి చెందాడు. స్థానికులు, ఎస్సై జ్యోతిమణి తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ పట్టణంలోని దివ్యానగర్‌కు చెందిన సుశ్వత్(18) దీక్ష జూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సిద్ధార్థ్-భవానీ ప్రసన్నల పెద్ద కుమారుడు. బుధవారం ఉదయం సుశ్వత్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జాతీయ రహదారిపై ఉన్న మున్సిపల్ ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం బోధనాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## అభివృద్ధి పనుల్లో జాప్యం చేయద్దు

**నిర్మల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్**


రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్

పెంబి, ఫిబ్రవరి 7: ఇటిక్యాల పంచాయతీ కార్యదర్శి నాలుగేండ్ల ప్రొఫెషనల్ కాలం ముగియడంతో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ గ్రామంలో బుధవారం పర్యటించారు. వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్డు, హరితహారం మొక్కలు, పారిశుధ్య పనులతోపాటు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో జాప్యం చేయవద్దని సూచించారు. గ్రామాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

## రూ.35 లక్షలు దోపిడీ

**మహారాష్ట్రలో జిల్లావాసులను దోచుకున్న దొంగలు**

ఎదులాపురం, ఫిబ్రవరి 7 : రైలులో ప్రయాణిస్తున్న ఆదిలాబాద్ జిల్లావాసులను మహారాష్ట్ర ప్రాంతంలో దొంగలు దోచుకున్నారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. ఆదిలాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త జగదీశ్ అగర్వాల్, తమ కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి నాసిక్‌లో పెళ్లికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రైలులో వస్తుండగా నాందేడ్ సమీపంలో మంగళవారం రాత్రి దొంగలు వారి బ్యాగుల్లో నుంచి నగదు, విలువైన ఆభరణాలు, సెల్‌ఫోన్‌లను ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.35 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ మేరకు వారు నాందేడ్ పోలీసులకు ఫిర్యాదు కేసు నమోదైంది.